క్లుప్తంగా

గిరిజనుల కష్టాలు తీరేదెన్నడు?



ఇసుకవాగును దాటుతూ అవస్థలు..

అశ్వాపురం: గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని మనుబోతులగూడెం, వేములూరు గ్రామాల అష్టకష్టాలు పడుతున్నారు. ఇక్కడి ప్రజలకు కనీస రహదారి సౌకర్యం లేదు. కాలినడకనే ప్రయణం. ముఖ్యంగా నిత్యం ఇసుకవాగును దాటుతూ రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం భారీ వర్షాలు, వాగులు ఉప్పొంగుతున్న నేపథ్యంలో వాగును దాటడం మరింత కష్టతరంగా మారింది. దాటకుండా వ్యవసాయ పనులు, ఇతర అవసరాలను రాకపోకలు సాగించలేదు. ముందుగొయ్యి, వెనుక నుయ్యి అన్నట్టు అగమ్యగోచరంగా వారి పరిస్థితి తయారైంది. అనారోగ్యం, ఇతర అత్యవసర ప్రయాణం చేయాల్సి ఉంటే సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోవాల్సిందేనా అని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా మంత్రులు స్పందించి తమ రెండు గ్రామాలకు కనీస రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఎంఈఓకు సత్కారం

గుండాల: మండల విద్యాధికారి పెండకట్ల కృష్ణయ్యను కొత్తగూడెంలో మంగళవారం తెలంగాణ సారస్వత పరిషత్తు సత్కరించింది. తెలంగాణ భాషా సాహితీ సాంస్కృతిక రంగాల అభివృద్ధికి గత ఆరు దశాబ్దాలుగా కృషి చేస్తున్న సారస్వత పరిషత్తు.. తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల చరిత్ర ప్రాశస్త్యాన్ని గ్రంథస్తం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాల సమగ్ర స్వరూపం గ్రంథాలను ప్రచురిస్తోంది. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర స్వరూపం కోసం పెండేకట్ల కృష్ణయ్య గిరిజన జానపద కలలు, సాంస్కృతి సాంప్రదాయాలు అనే వ్యాసాన్ని రాశారు. ఆ పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను జిల్లా కలెక్టర్ సన్మానించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు కార్యదర్శి చెన్నయ్య, వెంకటేశ్వర చారీ, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చండ్రుగొండ: పంచాయతీ కార్మికుల సమస్యలు సత్వరమే ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుడు రాయి రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పంచాయతీ కార్మికులతో కలిసి కొద్దిసేపు నిరశన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు 2 నెలల నుంచి జీతభత్యాలు అందించడం లేదని దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. కార్మికులకు రైన్ కోట్లు, హ్యాండ్ గ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు పెద్దిని వేణు, విప్పర్ల వెంకటేశ్వర్లు, నాగుల్‌మీరా, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

బూర్గంపాడు: వర్షాలు, వరదలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్ మంగళవారం పరిశీలించారు. శ్రీరాంపురం ఎస్టీకాలనీలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటనష్టం వివరాలను తెలుసుకున్నారు. పంటనష్టం నివేదికలను తయారుచేసి ప్రభుత్వానికి పంపుతామని ఆయన తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

బూర్గంపాడు: భారీవర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ముప్వా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం సారపాకలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ఆదుకోకుంటే రైతులు అప్పుల్లో కూరుకుపోతారన్నారు. ముఖ్యంగా కౌలురైతులు అన్నివిధాల నష్టపోతున్నారని, వారికి కూడా ప్రభుత్వం ఆర్థికసాయమందించాలని అన్నారు. పార్టీ నాయకులు పాండవుల భిక్షం, పేరాల శ్రీనివాసరావు,దాసరి మల్సూర్, సాజిద్, జహీర్, వహీద్, వెంకటేశ్వర్లు, క్రాంతి పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్ స్థల పరిశీలన

ములకలపల్లి: మండల పరిధిలోని జగన్నాథపురంలో నూతనంగా నిర్మించనున్న పెట్రోల్‌బంక్ స్థలాన్ని ఆర్డీఓ డి.మధు పరిశీలించారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావుతో కలసి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. భూ రికార్డులను, సర్టిఫికెట్లను పరిశీలించి, సమగ్ర వివరాలు సేకరించారు. ఆర్ఐ భద్రు, చైన్‌మెన్ రవి ఉన్నారు.

చండ్రుగొండ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సంస్థ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన పెట్రోల్‌బంక్ స్థలాన్ని ఆర్డీఓ మధు మంగళవారం పరిశీలించారు. సదుపాయాలు లేక బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. బస్సులు బస్టాండ్‌కు రావట్లేదు. ఈ క్రమంలో బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇక్కడ పెట్రోల్‌బంకు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంట తహసీల్దార్ సంధ్యారాణి, గిర్దావర్ అక్బర్, సర్వేయర్ ధర్మరాజు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

- బాధితుల స్థితిగతులు పరిశీలించిన ఎమ్మెల్యే పాయం
- ప్రభుత్వ సహకారానికి హామీ
- ఇతర పార్టీల నేతలూ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



అశ్వాపురం: పంటలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మణుగూరుటౌన్: ముంపు ప్రాంతాల్లో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: భారీ వర్షం, వరదతో ముంపునకు గురైన మణుగూరు పట్టణంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం పర్యటించారు. గాంధీనగర్, కాళీమాతా ఏరియా, చాపల మార్కెట్, శేషగిరినగర్‌లలో కాలినడకన కలియ దిరిగి.. పూర్తిగా ముంపునకు గురైన నివాసాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నివాసాల్లోకి వరద నీరు వచ్చిన తీరు, ఆ సమయంలో పడిన నరకయాతనను ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. పూర్తిగా ఇల్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇస్తామని భరోసానిచారు. పాక్షికంగా ప్రభావానికి గురైన బాధితులకు, జీవాలు కోల్పోయిన వారికి తగిన పరిహారం అందేందుకు కృషి చేస్తానన్నారు. ఆయా వివరాలు ప్రభుత్వం సేకరిస్తుండగా.. అందరూ వివరాలు అందించాలని సూచించారు. అనంతరం స్థానికులు చెప్పిన, కట్టాల్సిన చప్టాలను, బ్రిడ్జిలను, పూడిక తీయాల్సిన కాల్వలను నమోదు చేసుకుని, నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధుల మంజూరుకు మంతులతో మాట్లాడుతానన్నారు. ఇక, సాయంత్రం విప్పలసింగారం వద్ద ఉన్న చెక్ డ్యాంలను ఎమ్మెల్యే పరిశీలించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఉపయోగపడని చెక్ డ్యాంలు నిర్మించడం వల్లే సుందరయ్య నగర్ ముంపునకు గురైందని విమర్శించారు. పర్యటన కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, తిరుమలేశ్,సామా శ్రీనివాసరావు, కుచిపూడి బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆవుల సర్వేశ్వరరావు, పాతూరి వెంకన్న, గాండ్ల సురేశ్, అప్పారావు, కొర్స ఆనంద్, గోరంట్ల కనకయ్య, రహీం, వీరంకి వెంకట్రావ్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

అశ్వాపురం: భారీ వర్షాలకు వరదలకు పంటలు మునిగి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల బృందం మంగళవారం మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలో వరదలతో నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, నాయకులు మేడవరపు సుధీర్, డాక్టర్‌బాబు, జావిద్, దుర్గాప్రసాద్, రైతులు పాటి మన్మథరెడ్డి, రామగిరి భాస్కర్, శ్యామల యాదగిరిరెడ్డి, పగడాల వెంకటరెడ్డి, వెంగల భిక్షంరెడ్డి, కళ్లెం సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వరద ముంపు ప్రాంతాల్లో బీజేపీ నాయకులు మంగళవారం పర్యటించారు. బాధితులతో మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బాధితులను అన్ని విధాలా ఆదుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు పొడియం బాలరాజు, పున్నం భిక్షపతి, జిల్లా మహిళా నాయకురాలు చిర్ర సరస్వతి పట్టణ అధ్యక్షుడు లింగంపల్లి రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాస్‌లైన్ ఆధ్వర్యంలో..

మండల పరిధిలోని సాంబాయిగూడెం–పగిడేరు గ్రామాల మధ్యలోని పేరంటాల చెరువు అలుగు చప్టా పూర్తిగా ధ్వంసమైందని, చప్టాకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూధన్‌రెడ్డి అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం చప్టా ప్రాంతాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చప్టాకు మరమ్మతులు చేసి గ్రామాలకు రాకపోకలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్య పునరావృతం కాకుండా బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

సమాచారం ఇవ్వండి..



ఏఎంసీ కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్

భద్రాచలంఅర్బన్: గణేశ్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారు ఆన్లైన్ లో వివరాలు పొందుపరిచి, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కూడా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్లో నమోదు చేసుకుంటే భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి సులువుగా ఉంటుందని తెలిపారు. నమోదుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన పని లేదన్నారు. https://policeportal.tspolice.gov.in/index.htm వెబ్‌సైట్‌లో అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మండపాల వద్ద తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

భద్రాచలం గోదావరి వరదల కారణంగా ముంపునకు గురయ్యే కాలనీలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ సూచించారు. మంగళవారం భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీ, అశోక్‌నగర్ కొత్తకాలనీలో ఆయన పర్యటించి, వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, కాలనీలోకి వరద నీరు చేరిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆయన అన్నారు. గోదావరి వరద నీరు వేగంగా పెరుగుతుందని, కావున ఎవరూ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే డయల్ 100కు గాని లేదా 8712682106 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.. అనంతరం కరకట్ట వద్ద ఉన్న విస్తా కాంప్లెక్స్‌తో పాటు గోదావరి స్నాన ఘట్టాలను సందర్శించిచారు. అనంతరం గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. ఉధృతిని తిలకించేందుకు ఎవరినీ అనుమతించవద్దని టౌన్ పోలీసులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో భద్రాచలం టౌన్ ఏఎస్ఐ అప్పారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రులపై దాడి అమానుషం

మణుగూరురూరల్: బీఆర్ఎస్ అగ్రనేత హరీష్‌రావు, మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావులపై కాంగ్రెస్ గూండాలు దాడులకు పాల్పడడం అమానుషమైన చర్య అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. భారీ వర్షానికి వరద ముంపుకు గురైన బాధితులను బీఆర్ఎస్ మాజీ మంత్రులు పరామర్శించి ధైర్యం చెప్పి వస్తున్న క్రమంలో కొంతమంది కాంగ్రెస్ గూండాలు దాడులు చేయడం పిరికిపంద చర్య అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

భద్రాచలంటౌన్: ఖమ్మం మున్నేరు వరదలతో నష్టపోయి సర్వం కోల్పోయిన బాధితులను పరామర్శించి వస్తున్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై దాడి చేయడం హేయమైన చర్య అని భద్రాచలం బీఆర్ఎస్ నాయకుడు ఆకోజు సునిల్ మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాన్ని సందర్శించడంతో పాటు బాధితులకు నిత్యవసర వస్తువులు అందించడానికి వచ్చిన మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్ రెడ్డి కార్లపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్ల దాడి చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. వరదను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ బురద రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

చండ్రుగొండ: ఖమ్మంలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకులపై కాంగ్రెస్ పార్టీ గూండాలు దాడి చేయడం ప్రజాస్వామ్యానికే విరుద్ధమని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొడకండ్ల వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భౌతికదాడులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 35 ఏళ్లపాటు తాను కాంగ్రెస్ పార్టీలో పనిచేశానన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలో నిజమైన నాయకత్వం లేదని.. ఆ పార్టీ బడా బాబులు, కాంట్రాక్టర్ల చేతిలోకి వెళ్లిందన్నారు. ఖమ్మంలో జరిగిన దాడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే జారే ఆకస్మిక పర్యటన



ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలోని పార్కెలగండి గ్రామంలోని గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి రూ.20లక్షల రూపాయాలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పట్వారీగూడెం గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సిబ్బందికి సూచించారు.

డ్రైయినేజీలను ఆక్రమిస్తే చర్యలు

కరకగూడెం: డ్రైయినేజీలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని డ్రైయినేజీని పరిశీలించారు. కొంతమంది వ్యాపారస్తులు డ్రైయినేజీని దాటి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం గుర్తించారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండల కేంద్ర వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేసి.. డ్రైయినేజీలపై ఎటువంటి వస్తువులు పెట్టవద్దని హెచ్చరించారు. త్వరలోనే పంచాయతీ అధికారులతో కలసి పూడిక తీత పనులు చేపడుతామని తెలిపారు. ఆర్ఐ కృష్ణ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మారుతీ యాదవ్, వ్యాపారస్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

చర్ల: గణేష్ నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చర్ల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.రాజు వర్మ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాటు చేసే విగ్రహాల ఎత్తు, ఏర్పాటు చేసే ప్రదేశం తదితర వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని ఆయన సూచించారు. విద్యుత్ సరఫరా తీసుకునే ముందు విద్యుత్‌శాఖ అనుమతి పొందాలని అ న్నారు. తక్కువ శబ్ద కాలుష్యంతో స్పీకర్లు మాత్రమే మండపాల్లో ఏర్పాటు చేయాలని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వాడాలని సూచించారు.

అంగన్‌వాడీల్లో మెరుగైన విద్య

మణుగూరురూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ సెంటర్లలో మెరుగైన విద్యను అందిస్తున్నట్లు మణుగూరు ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి తెలిపారు. సమితిసింగారం సెక్టార్ పరిధి కూనవరం పంచాయతీ ఎన్‌టీఆర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీఓ హాజరై మాట్లాడారు. పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: పోషకాహారాన్ని క్రమంతప్పకుండా తీసుకుంటేనే ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ జె.వరలక్ష్మి అన్నారు. మంగళవారం నారంవారిగూడెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యదర్శి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల ఐద్వా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పూనెం కనకదుర్గ, మిడియం జయలతో పాటు 18మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐద్వా మండల మహాసభలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా కొమరం భద్రమ్మ, మడివి విజయలక్ష్మి, మడకం లక్ష్మి, శ్వేత, దేవి, పార్వతి, సుశీల, సోయం నాగమణి, గీతాలపాక అలివేలి, కొండమ్మ, సావిత్రి, శోభారాణి, సీతమ్మ, కాంతమ్మ, మడకం విజయలక్ష్మి, కె.నాగమణి ఎన్నికయ్యారు.

ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

దమ్మపేట: దమ్మపేట మండలం అంకంపాలెం గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 5వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుణ కుమారి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఆసక్తి, తగిన అర్హతలు ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో కళాశాల వద్ద హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

క్రీడాకారుల ప్రతిభ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీటీస్టైల్ జిమ్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటారు. హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్రస్థాయి తెలంగాణ బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచి 5 బంగారు, 2 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మిమ్స్ ఆస్పత్రి వైద్యులు మంగళవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గురుతేజ, బాలా, జిమ్ కోచ్ జీవీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం నియామకం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బెక్కంటి శ్రీనివాసరావును నియమించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ చిలకమర్రి శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు చుక్క శ్రీనివాసరావు, సీహెచ్ అనిల్ కుమార్ పీవీరమణ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక బస్తాల ఏర్పాటు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని స్లూయిస్‌ల వద్ద ఇరిగేషన్ సిబ్బంది మస్తాన్ వలీ ఆధ్వర్యంలో ఇసుక బస్తాలను బుధవారం ఏర్పాటు చేశారు. గోదావరికి భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో వరద నీరు స్లూయిస్ల నుంచి గ్రామంలోకి రాకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యల్లో భాగంగా ఇసుక ఈ బస్తాలను ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెంట్లం గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ)వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక జ్వరపీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. హెచ్‌ఈఓ రాంప్రసాద్, హెచ్ఎస్ ప్రకాశరావు, హెచ్ఈ రత్తమ్మ, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని రామారావు పేట, నందులచెలక గ్రామాల్లో డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటి సర్వేతో పాటు డ్రైడే చేపట్టి నీటి నిలువలను తొలగించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల పరిధిలోని గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి కారం మధు సుమారు 122 మంది గ్రామస్తులు, విద్యార్థులను పరీక్షించి అందులో 26మందిని జ్వర పీడితులుగా గుర్తించారు. మందులను అందజేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్, హెచ్‌ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, ఆరోగ్య సహాయకులు నర్సింహారావు, కృష్ణ, ఆశా కార్యకర్తలు సిబ్బంది పాలొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలి

భద్రాచలంఅర్బన్: జనావాసాల మధ్య నిర్మించే సెల్ టవర్‌ను తక్షణమే నిలుపుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అధికారులను ఆదేశించారు. భద్రాచలం పట్టణంలోని జగదీష్ కాలనీలో సెల్ టవర్ నిర్మించేందుకు సెల్ కంపెనీ ప్రయత్నించడంతో వెంటనే ఆ నిర్మాణాలని ఆపాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, తహసీల్దారు, గ్రామపంచాయతీ ఈవోలకు వినతి పత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బాధితుల సమక్షంలోనే గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావుకు ఫోన్ చేసి తక్షణమే సెల్ టవర్ పనులను నిలిపివేయాలని సూచించారు. వినతిపత్రం అందించినవారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జగదీష్ కాలనీ ప్రజలు తదితరులు ఉన్నారు.

తుమ్మలచెరువు ఆయకట్టులో నష్టం



వరదకు కొట్టుకుపోయి గండ్లు పడిన పొలంలో రైతు ఆవుల రవి


అశ్వాపురం: మండల పరిధిలోని ప్రధాన సాగునీటి వనరైన తుమ్మలచెరువు ఆయకట్టు కింద భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహించి తుమ్మలచెరువు అలుగు గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదు అడుగులకు పైగా ప్రవహించింది. దీంతో రైతులకు ఊహించని నష్టం వాటిల్లింది. గత మూడు రోజులుగా చెరువు అలుగు పారుతూనే ఉంది. అలుగు ప్రవాహానికి సుమారు 600 ఎకరాలు నీట మునిగాయి. వీటిల్లో కొన్ని పొలాలు నీటి నుంచి బయటకు రాగా సుమారు 250 ఎకరాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పొలాలు గండ్లు పడి ఇసుక మేటలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉదాహరణకు మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన రైతు ఆవుల రవి రెండు ఎకరాలు వరి సాగు చేయగా.. అలుగు ఉధృతికి ఎకరంన్నర పొలం పూర్తిగా కొట్టుకుపోయింది. పొలం ఇసుక మేట, గండ్లు పడి సాగుకు ఉపయోగం లేకుండా తయారైంది. తిరిగి సాగుకు రావాలంటే సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేసి మట్టి పోయించాల్సి ఉంటుంది. ఇలా ఎంతో మంది రైతులు నష్టాలతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

సంక్షేమ బోర్డు ద్వారానే అందించాలి




భద్రాచలంఅర్బన్: లెబర్ అధికారి ఏసుపాదంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సంక్షేమ బోర్డుతోనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలని బిల్డింగ్–అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్, లేబర్ ఆఫీసర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం భవనిర్మాణ కార్మిక సంక్షేమాన్ని ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించేందుకు టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తోందని, వెంటనే ఆ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: తహసీల్ వద్ద ఆందోళన..



చర్ల: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తూ..

పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు

అన్నపురెడ్డిపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ మహాలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దిరెడ్డిగూడెం, ఊటుపల్లి, అన్నపురెడ్డిపల్లి, పెంట్లం పంచాయతీలలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో మురుగునీరు, చెత్తాచెదారం నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

మణుగూరురూరల్: శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూనవరం గ్రామ పంచాయితీలో ఎస్‌కె జాఫర్‌కు చెందిన ఆటో వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మరమ్మతులకు గురైంది. విషయాన్ని కూనవరం మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్ ద్వారా తెలుసుకున్న పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆటో మరమ్మత్తుల కోసం రూ.3వేలను స్థానిక పార్టీ కార్యాలయంలో బాధితుడికి అందజేశారు. సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, నాయకులు వట్టం రాంబాబు, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.